# బాకీ

కె.వరలక్ష్మి



పొద్దున్నే పేపరు చూస్తూ టీ తాగుతున్న భారతి ఒక్క పొలికేక పెట్టింది ''అక్కయ్యోవ్, బాపూ గారి 'వంశవృక్షం' క్రౌన్‌లో కొచ్చిందేవ్''

వినపడిందో లేదోనని మళ్లీ అరవబోతూండగా శారద తన టీ కప్పుతో వచ్చి ఎదుటి సోఫాలో కూర్చుంటూ ''ఎన్నిసార్లు చూస్తావేం ఆ పిక్చర్‌ని? అంది. ''ముందే చెప్తున్నాను, నేను రానుబాబూ, చాలాసార్లు టీవీలో కూడా వచ్చేసిందది''.

''టీవీలో చూసేదీ ఓ సినిమాయేనా, చూస్తే థియేటర్లో చూడాలి. చెప్తే నమ్మవుకాని ఈ మధ్య సి.డి. తెప్పించుకుని కన్నడ మూలం వంశవృక్షం చూసేను. దీనిముందది బలాదూర్, బాపూగారి డైరెక్షన్లో పట్టిసీమనూ, గోదారినీ ఎన్నిసార్లు చూస్తే తనివితీరుతుంది? పైగా ముళ్ళపూడివారి అద్భుతమైన డైలాగ్స్, అన్నిటినీ మించి లేత తాటిముంజెలాంటి అనిల్‌కపూర్..''

''అదా సంగతి'' అంటూ నవ్వింది శారద.

''కాదనకే అక్కయ్యా, రాకరాక సెలవుపెట్టి వచ్చిన ఓ చెల్లెలు కోరక కోరక కోరిన కోరిక కాదనకే అక్కయ్యా'' అంది భారతి నాటకీయంగా.

''ఓకే, శాంక్షన్డ్''

***

గేటు దగ్గరున్న వ్యక్తి చేతిలో టిక్కెట్లు పెట్టేసి లోపలికి నడిచింది శారద. ఉదయం పదకొండు గంటల వేళ, వేసవి వెల్తురులోంచి రావడం నుంచి హాలులోపల చిమ్మ చీకటిగా అన్పించిందో క్షణం.

చింపిన టిక్కెట్లు ముక్కల కోసం చెయ్యిచాచి షో స్టార్టయి పోయిందేమోనని ఆత్రంగా లోపలికి తొంగిచూసింది భారతి. టిక్కెట్టు ముక్కల్ని ఇవ్వడం మరచి పోయి కన్నార్పకుండా చూస్తున్న గేట్‌కీపర్ని విసుగ్గా చూసి, అతని చేతిలో ముక్కల్ని లాక్కున్నంత పనిచేసి లోపలికి నడిచింది భారతి. నాలుగడుగులేసాక ఆ ముఖాన్నెక్కడో చూసినట్టన్పించి వెనక్కి తిరిగి చూసింది. ఆసరికే అతను అటు తిరిగి పోయాడు.

ఇంటర్వెల్లో చటుక్కున గుర్తుకొచ్చింది ఆ ముఖం ఎవరిదో గోవిందు అవును గోవిందే కాని, గోవిందు మరీ అంత సన్నగా రోగిష్టిలాగా ఉండడే!

అదాటున లేచి గేటు వైపు వెళ్ళింది.

గేటు దగ్గర ఇప్పుడు మరొకతను ఉన్నాడు. బైటికెళ్లే వాళ్లకి అవుట్ పాసులిస్తున్నాడు.

ఓ పక్కగా నిలబడి అతన్ని పిలిచింది భారతి.

''ఇదిగో చూడు ఉదయం ఈ గేట్లో ఉన్నతని పేరు గోవిందేనా?''

ఆమె గొంతులోని కంగారు చూసి గేటు దగ్గరి వ్యక్తి భయపడ్డాడు. ''ఏంటి మేడమ్, ఏం జరిగింది?'' అన్నాడతను.

''ముందిది చెప్పు, అతని పేరు గోవిందేనా?''

''అవునండి''

''ఇప్పుడెక్కడున్నాడు?''

''అతాత్తుగా ఒంట్లో బాగోలేదని సెలవడిగి ఇంటికెళ్లి పోయేడండి, ఏం జరిగింది, ఏవన్నా అమర్యాదగా ప్రవర్తించేడా?''

''అదేం కాదులే, అతని ఇల్లెక్కడో తెలుసా పోనీ''

''తెలవదండి, అద్దె తక్కువని ఈ మజ్జినే ఊరికి దూరంగా మారేడండి''

''షో విడిచిపెట్టే వేళకి వస్తాడా?''

''ఇంక ఇయాల్టికి రాడండి, సెలవడిగి ఎల్లిపోయేడు కదండి''

సంగతేంటో తెలీని క్యూరియాసిటీ అతని

మొహాన్ని వీడక పోవడం గమనించి "అతను మాకు తెలిసినవాడులే" అని వచ్చేసింది భారతి.

***

గోవిందుని అలా చూసేక భారతి మనసంతా వికలమైపోయింది. ఎలాంటి గోవిందు ఎలాగైపోయాడు. దీనికంతటికీ కారణం ఎవరు? ఈ వ్యవస్థా? రాజ్యాంగమా? స్వయంకృతాపరాధమా? ఏదో తిన్నాననిపించి తన గదిలోకెళ్లి పడుకుంది భారతి.

మనసు ముప్ఫై ఏళ్ళ వెనక్కి ఎగిరెళ్ళింది.

తనప్పుడు ఎలిమెంటరీ స్కూల్లో రెండో తరగతి చదువుతోంది. సాయంకాలం బడి నుంచి వచ్చేసరికి పెరట్లో నూతి చప్టామీద గిన్నెలు తోముతూ ఒకావిడ, ఆవిడ మెడచుట్టూ చేతులేసి వీపు మీద వేలాడుతూ ఓ అబ్బాయి కన్పించేరు. చామనఛాయతో బూరెల్లాంటి బుగ్గల్తో ఆ అబ్బాయి బలేముద్దొచ్చేలా ఉన్నాడు.

తను పుస్తకాల సంచి భుజం నించితీసి అరుగు మీద ఉంచి కాళ్ళు కడుక్కోడానికి నూతి చప్టామీద కుండీ దగ్గరకి వెళ్ళింది. తనని చూసి ఆ అబ్బాయి చటుక్కున వాళ్ళమ్మ నొదిలేసి లేచి నిల్చున్నాడు.

తనకన్నా ఓ గుప్పెడు పొడవున్నాడు. అంతపెద్ద వాడు అలా వాళ్ళమ్మ వీపు మీద వేళ్ళాడుతున్నందుకు తనకి నవ్వొచ్చింది. తను నవ్వడం చూసి ఆ అబ్బాయి కూడా నవ్వేడు.

"నీ పేరేంటమ్మా పాపా" అందావిడ.

"భారతి" అని "మీ అబ్బాయి పేరేవిటి?" అంది తను.

ఆవిడ నవ్వింది. "గోవిందు"అన్నాడా అబ్బాయి హుషారుగా.

"ఏ క్లాసు?"

"మూడు"

"రేపట్నుంచి నువ్వెళ్ళేబడికి మా గోవిందుని కూడా తీసుకెళ్తావా అమ్మా" అనడిగిందావిడ.

"సరే, ముందు బళ్ళో పేరు రాయించండి" అంది తను.

"భారతీ, బడినించి రాగానే వాళ్ళని ఇబ్బంది పెడుతున్నావా" అని కేకపెట్టింది భారతి వాళ్ళమ్మ. "ఏమనుకోకండి, కొంచెం వాగుడు కాయ అది" అని కూడా అంది.

"లేదమ్మా, ఈవిడే నన్ను వాళ్ళబ్బాయిని బడికి తీసుకెళ్ళమంటున్నారు"

భారతి వాళ్ళమ్మ వంటింట్లోంచి కోపంగా బైటికొచ్చింది. "ఈవిడేవిటి, ఈవిడా ఆవిడాను, అత్తయ్యగారు అనాలి తెల్సా, మన చిన్నింట్లోకి అద్దెకొచ్చారు" అంది. "మా పెద్దపిల్ల శారద నెమ్మదైంది. వీళ్ళద్దరికీ ఆరేళ్ళు ఎడం, అది హైస్కూల్లో చదువుతోంది"

భారతి వాళ్ళకి ఇంటి పక్కనే మరో రెండు గదుల చిన్నపెంకుటిల్లు ఉండేది. తూర్పుగోదావరి ఏజన్సీ ప్రాంతంలో ఉన్న ఆ వూళ్ళో అద్దెకు దిగేవాళ్ళెవరూ లేక, రెండిళ్ళనూ శుభ్రం చెయ్యలేక, ఎవరైనా వాకిట్లో ముగ్గేసి, దీపం వెలిగించుకుంటే చాలు, డబ్బు గిబ్బు ఏం వద్దు, మనిషికి మనిషి తోడుగానైనా ఉంటారు, చిన్నింటిని ఎవరికైనా ఇద్దాం! అంటూ ఉండేది భారతి తల్లి భర్తతో తరచుగా, ఇన్నాళ్ళకి ఆవిడకోరిక నెరవేరింది.

గోవిందు తండ్రి సూర్యారావుగారు ఆ ఊళ్ళో కొత్తగా పెట్టిన ఎక్సైజ్ ఆఫీసులో జవాను. ఆయన సర్వీసు ఏజన్సీ ప్రాంతంలోనే ప్రారంభమై అక్కడే తిరుగుతోంది.

వాళ్ళకి గోవిందు ఒక్కడే కొడుకు, మరిలేరు. గోవిందుని వాళ్ళమ్మా నాన్నా బాగా గారాబం చేసేవారు. వాడి మాటకి ఎదురుండేది కాదా ఇంట్లో.

గోవిందు చాలా చురుకైనవాడు, త్వరలోనే గోవిందు, భారతి మంచి మిత్రులైపోయేరు. ఎక్కడ చూసినా వాళ్ళిద్దరే జంటగా కన్పించేవారు. బడికెళ్ళేటప్పుడు, బడి నుంచి వచ్చేక చదువుకునేటప్పుడు, ఆటలాడుకునేటప్పుడు, చివరికి భోజనాలు చేస్తున్నా ఇద్దరూ ఎవరి కంచం వాళ్ళు తెచ్చుకుని రెండిళ్లకీ మధ్య వాకిట్లో కూర్చుని జంటగా తినేవాళ్లు.

భారతి చేతిని పట్టుకుని తన వెంట తిప్పుకోవడం గోవిందుకి అలవాటైపోయింది. అంతకు ముందంతా తొక్కుడు బిళ్ళాట తప్ప ఇంకేమీ తెలీని భారతికి గోవిందు రకరకాల ఆటలు పరిచయం చేసాడు. కర్రాబిళ్ళాట, బొంగరాలాట, గోళీలాట, బంతాట అన్నీ.

సెలవురోజొస్తే వీధిలో పిల్లలందర్నీ పోగు చేసి సినిమా ఆట ఆడించేవాడు. భారతి వాళ్ళ ముందు గదిలో ఆ ఆట సాగేది. చిన్న చిన్న కాయితం ముక్కలు చించి చిల్ల పెంకుల డబ్బులకి వాటిని టిక్కెట్లుగా అమ్మేవాడు. భారతి గది గుమ్మంలో నుంచుని ఆ టిక్కెట్లు చింపి ఒక్కొక్కళ్ళనీ గదిలోకి పంపించాలి. గోవిందు బైట ఎండలో ఓ చిన్న అద్దం పుచ్చుకుని కూర్చునేవాడు. గదిగోడల మీదికి అద్దం మీద పడిన సూర్యకిరణాన్ని రిఫ్లెక్ట్ చూస్తూ ఉండేవాడు. అదే సినిమా, దానికోసం కార్డుబోర్డు అట్టల్ని హారన్స్‌లాగా చుట్టి తయారు చేసి "ఆ...రండి బాబూ రండి, మంచి సినిమా, తప్పక చూడండి" అంటూ వీధంతా తిరిగి ఎనౌన్స్ చేసేవాళ్ళు ఇద్దరూ.

వాళ్ళు మందులలోకి అనుపానంగా నారింజరసం వాడేవారు, ఓ గిన్నె నిండా నారింజ రసం పిండి, పల్చని గుడ్డతో దాన్ని వడకట్టి, రసాన్ని మూలికల్తో కలిపి నూరుతుండేవారు. వాళ్ళు రసం వడపోసే వేళకి గోవిందు భారతిని తీసుకుని అక్కడ హాజరైపోయేవాడు గుడ్డలో మిగిలిన నారింజముత్యాల ముద్దకోసం.

ఒకోరోజు మూతికి ఎర్రరంగు దూది అంటించుకుని, ఒక తాడుని తోకలాగ నిక్కర్లో దోపుకొని, కర్రపుల్లకి చివర గుడ్డలు చుట్టి దాన్ని గదలాగ భుజం మీద ఉంచుకుని ఆంజనేయుడి వేషం వేసేవాడు గోవిందు, దానికీ టిక్కెట్లే, అన్నిటికీ భారతి అతనికి అసిస్టెంటుగా ఉండవలసొచ్చేది.

శ్రీరామ నవమికి పెద్ద భక్తుల్లాగా కోవెల కెళ్ళిపోయి వడపప్పుపానకాలు కొసరి కొసరి అడిగి తెచ్చుకోవడం, సాయంత్రం ఆరుగంటలకే అన్నాలు తినేసి వెళ్ళిపోయి వినాయకవితి పందిళ్లలో అలిసిపోయేలాగ ఆటలాడి తీరా హరికథో బుర్ర కథో ప్రారంభమయ్యే వేళకి పందిట్లో బరకాల మీద పడి నిద్రపోవడం, రాత్రి నాన్నమ్మ పక్కలో చేరి రాజకుమారుల, మాంత్రికుల కథలు వినడం, చలికాలం తాతయ్య మంచంకింది ఊకకుంపటి వెచ్చదనాన్ని ఆస్వాదిస్తూ ఆయన్ని కరుచుకుని చెరోవైపు పడుకోవడం బాల్యం నాటి మధురమైన జ్ఞాపకాలన్నీ గోవిందు తోడివే. ఊరిబైట తోటల్లో కోసుకొచ్చిన కాయలు, పళ్ళు, అడవి దారుల వెంట వెళ్లి తుంచుకొచ్చిన రంగురంగుల పూల పరిమళాలు అన్నీజ్ఞాపకాల్లో ఫ్రెష్‌గా ఉన్నాయి భారతికి.

భారతి వాళ్ళింటికి నాలుగిళ్ళకవతల ఓ వృద్ధ జంట ఉండేవారు. వాళ్ళకి పిల్లలు లేరు. ఆ ముసలాయన అడవికెళ్ళి రకరకాల వనమూలికల్ని సేకరించి తెచ్చేవాడు. వాటిని గుళికలుగా తయారు చేసేవాడు. ఊళ్ళో ఎవరికే అనారోగ్యం చేసినా ఆ గుళికలిచ్చి వైద్యం చేసేవాడు.

వాళ్ళిద్దరూ తెల్లవారు ఝామునే లేచి మూలికల్ని కల్వాల్లో వేసుకుని నూరుతూ రకరకాల పాటలు, కీర్తనలు పెద్దగా గొంతెత్తి పాడేవారు. వాళ్ళు ఎంతో మధురంగా పాడే 'శివుని రాణీ మధురవాణీ' అనే పాటని తనూ పాడాలని గోవిందు పెద్దగా బొంగురుగొంతుతో శృతి స్వరం పాటించకుండా పాడేసి అందర్నీ నవ్వించేవాడు.

వాళ్ళు మందులలోకి అనుపానంగా నారింజరసం వాడేవారు, ఓ గిన్నె నిండా నారింజరసం పిండి, పల్చని గుడ్డతో దాన్ని వడకట్టి, రసాన్ని మూలికల్తో కలిపి నూరుతుండేవారు. వాళ్ళు రసం వడపోసే వేళకి గోవిందు భారతిని తీసుకుని అక్కడ హాజరైపోయేవాడు గుడ్డలో మిగిలిన నారింజముత్యాల ముద్దకోసం.

పుల్లపుల్లని ఆ నారింజముత్యాల రుచిని గోవిందుతోడి స్నేహం లాగే భారతి ఇప్పటికీ మరచిపోలేదు.

హైస్కూలుకి వచ్చాక కూడా గోవిందు, భారతిల స్నేహం దూరం కాలేదు. పదో తరగతి వరకూ గోవిందు చదివేసి ఇచ్చిన క్లాసు పుస్తకాలతోనే భారతి చదువు సాగింది.

బాల్యంలో అంత ఆటవిడుపుగా సాగిన గోవిందు జీవితం పెద్దయ్యాక ఒక్కసారిగా మలుపు తిరిగి ఉల్టాసీదా అయి పోయింది.

తెలిసో తెలీకో అతని తండ్రి చేసిన ఒక పొరపాటుకి గోవిందు జీవితం బలైపోయింది.

గోవిందు తండ్రి మైదాన ప్రాంతపు కాపుకులస్థుడు. అతని ఉద్యోగానికి సంబంధించిన సర్టిఫికెట్స్‌లో అతను ఒ.సిగా నమోదై ఉంది. గోవిందుని బళ్ళో చేర్పినప్పుడు మాత్రం తెలీకో, స్వార్థంతోనో కొడుకు కులం కొండకాపు అని రాయించేడాయన. ట్రైబల్ ఫెసిలిటీస్‌తో చదువుకున్న గోవిందుకి ఇంటర్మీడియేట్ పూర్తవుతూనే ఎస్.టి కోటాలో సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగం దొరికింది.

వెంటనే మేనమామ కూతురుతో పెళ్ళి, కాపురం. 'మా కొక్కడే కొడుకు, పదిమంది మనవలు మా ఇంట్లో తిరగాలి' అనేది గోవిందు తల్లి.

ఆ తర్వాత ఎంక్వైరీలో అసలు విషయం బైట పడి అతను ఉద్యోగం నుంచి బర్తరఫ్ అయ్యాడు.

ఒక్కగానొక్క కొడుకు భవిష్యత్తుని తల్చుకుని




ఆందోళనతో అతని తల్లి మంచం పట్టింది. అప్పుడే రిటైరైన అతని తండ్రి గోవిందు చదువుకి గవర్నమెంటు ఖర్చుచేసిన పైకాన్ని వడ్డీ వాయిదాల్తో చెల్లించాల్సి వచ్చింది.

ఎన్నో పాట్లుపడి, ఎంతో డబ్బు ఖర్చుచేసి కొడుకూ తనూ జైలు కెళ్లకుండా కాపాడుకుంటూ వాచ్చుడాయన.

చివరికి ప్రభుత్వ ఉద్యోగానికి అనర్హుడనే ముద్రతో మిగిలాడు గోవిందు.

బతుకు తెరువుకి ఏదో ఒకటి చెయ్యాలికదా అని కొడుకు చేత కిరాణా దుకాణం తెరిపించాడు గోవిందు తండ్రి. అలవాటు లేనిపని, వ్యాపారం చెయ్యడం గోవిందువల్ల కాలేదు. దానిలోనూ నష్టపోయేడు. క్రమంగా మానసిక వేదనతో తండ్రి కూడా మంచం పట్టేడు. నెలనెలా అందే తండ్రి పెన్షను తప్ప గోవిందుకి మరో ఆధారం లేకుండా అయ్యింది. ఆ ఊళ్ళో ఇక బతకడం సాధ్యం కాక ఓ రాత్రివేళ కుటుంబసమేతంగా ఊరొదిలి అందరూ వాళ్ళ సొంత ఊరికి వెళ్లిపోయేరు.

భారతి బి. ఎడ్ టీచరుగా సెటిలయ్యేసరికి ఇదంతా జరిగిపోయింది.

సొంత ఊరికి వెళ్ళినప్పుడల్లా ఆ ఇళ్ళూ వాకిళ్ళూ చూసిన ప్రతిసారీ గోవిందు, అతనితో తన బాల్య స్నేహం గుర్తుకొచ్చి మనసు బాధగా మూలుగుతూంటుంది భారతికి.

ఇన్నాళ్ళకి ఇదిగో ఇప్పుడిలా సినిమా హాలు గేట్లో టిక్కెట్లు చింపుతూ అతడలా ప్రత్యక్షమయ్యేసరికి భారతి తట్టుకోలేకపోతోంది. తనని చూసి అతను మొహం చాటు చేసుకోవాల్సిన అవసరం ఏమొచ్చింది? ఆ మాటే శారదతో అంటే ''పాపం పోనీవే, అతనేం ఇబ్బందుల్లో ఉన్నాడో, అయినా అందరూ నీలాగే అంత సెంటిమెంటల్‌గా ఉంటారేమిటి? బాల్యస్నేహం అదీ ఇదని అందరూ గుర్తుపెట్టుకోవద్దూ!'' అని తేల్చిపారేసింది.

మర్నాడు భారతి మళ్ళీ గోవిందుని కలవాలని థియేటర్‌కి వెళ్ళింది. అతని కోసం ఎంక్వైరీ చేసింది.

అతను రావడం వచ్చాడట కాని, మళ్ళీ సెలవు పెట్టి వెళ్తూ ఓ కబురు చెప్పేడట ''ఆవిడకి నేను రెండు వందలు బాకీ, ఇప్పుడు తీర్చే పరిస్థితిలో లేను, ఎక్కడుంటున్నారో ఎడ్రస్ ఇచ్చి వెళ్తే త్వరలోనే పంపించేస్తాను'' అని.

ఆ కబురు చెప్పిన వ్యక్తి మరో మాట కూడా అన్నాడు ''నలుగురు ఆడపిల్లల తర్వాత ఒక కొడుకు, జబ్బుతో మంచంలో ఉన్న తల్లి, పాపం కుటుంబం పెద్దదండి, మనిషి మంచోడే, కాని డబ్బు కెప్పుడూ ఇబ్బందేనండి. మీలాటోరికి రొండొందలొక లెక్కేటండి, పోనియ్యండి'' అని.

భారతి బిత్తరపోయింది ఈ రెండు వందల గొడవేమిటో ఆమెకి ఓ పట్టాన గుర్తురాలేదు.

ఇంటికొచ్చి చాలా ఆలోచించాక తను ఉద్యోగంలో చేరిన కొత్తల్లో జరిగిన సంఘటనొకటి గుర్తుకొచ్చింది.

భారతి అప్పటికి సొంత ఊళ్ళోనే టీచర్‌గా పనిచేస్తోంది. ఆ రోజు స్కూలు కెళ్ళే తొందర్లో వంటపనిలో ఉంది. అనుకోకుండా వెనక నుంచి వినిపించింది ''భారతీ, రెండొందలుంటే ఇవ్వవా, నాన్న పెన్షను రాగానే ఇచ్చేస్తాను''

భారతి ఆశ్చర్యంగా వెనక్కి తిరిగి చూసింది, వంటింటి గుమ్మంలో గోవిందు.

''ఎప్పుడొచ్చావ్, అత్తయ్య మామయ్యా అంతా బావున్నారా?'' అంది.

''ఇక్కడేదో పని దొరుకుతుందంటే వచ్చేను, కొంచెం డబ్బులు అవసరం పడ్డాయి'' అన్నాడు సంజాయిషీలాగ.

''ఒక్క నిమిషం ఆగు, పప్పు పులుసు లో పోపు వేసేసి ఇస్తాను'' అంది.

బీరువాలోంచి డబ్బులు తీస్తూ ''ఇదేవిటీ కొత్త అలవాటు, అదే అప్పులెయ్యడం'' అంది అనాలోచితంగా. అతను మాట్లాడలేదు. డబ్బులు ఇస్తూ గంటుపెట్టుకున్న అతని మొహాన్ని చూసి నొచ్చుకుంది. తనన్న మాటని అతను సీరియస్‌గా తీసుకున్నట్టున్నాడు. అతని ముక్కుపుటాలు అదురుతున్నాయి. కళ్లల్లో నీళ్ళు తిరుగుతున్నాయి.

అప్పుడర్థమైంది భారతికి తనలా అని ఉండకూడదని.

టేకిటీజీగా ఉండే గోవిందు ఇంత సెన్సిటివ్‌గా ఎప్పుడు మారిపోయేడు?

''త్వరలోనే ఈ బాకీ తీర్చేస్తాలే'' అన్నాడు వెళ్ళబోతూ.

''ఒక్క నిముషం ఆగు, అన్నం దించేసి చల్లారబోస్తాను, నీ కిష్టమైన పప్పుపులుసు, రెండు ముద్దలు తిని వెళ్దువుగాని'' అంది భారతి.

అవుననీ కాదనీ అనకుండా గుమ్మంలో తచ్చాడి, గబగబా నడుచుకుంటూ వెళ్లిపోయేడు.

'ఏదో పని తొందరలో ఉండి ఉంటాడులే' అనుకుంది తను.

నాడలా వెళ్లిన గోవిందుని ఇదిగో ఇప్పుడే తిరిగి చూడడం.

అయ్యో, గోవిందు తనని ఎంత అపార్థం చేసుకున్నాడు!

శారద అన్నట్లు బాల్యస్నేహం, ఆ జ్ఞాపకాల మధురిమ అందరికీ గొప్పవి కావు కాబోలు, తను స్నేహం కోసం పాకులాడుతుంటే గోవిందు తనని బాకీ వసూలు చేసుకోడానికి వెళ్ళిందనుకుంటున్నాడు.

అతన్ని అపార్థం చేసుకోవాల్సిన పరిస్థితి కూడా కాదేమో, రెండు వందలు కూడా చేతిలోలేని దీనావస్థలో ఉన్నట్టున్నాడు. ఆర్థికపరమైన ఇబ్బందులు మనిషి ఆలోచనా విధానాన్నే మార్చేస్తాయి కాబోలు. భారతికి కళ్ళల్లో నీళ్ళూరేయి.

ఉద్యోగం సద్యోగం లేని గోవిందు అయిదుగురు పిల్లల్ని కన్నాడంటే అతనెంత మూర్ఖుడో అర్థమై కొంత విసుగు కూడా కలిగింది. కానీ, ఆమె అభావంగా ఉండలేకపోయింది.

భారతి మర్నాడే బయలుదేరాల్సి ఉంది.

సినిమా హాలు ఎడ్రస్‌కి గోవిందుకి రాసిన ఇన్‌లాండ్ లెటరు అంటించేముందు ఓ సారి చదువుకుంది.

*గోవిందూ!*

''ఇన్నేళ్ళ తర్వాత నిన్ను చూస్తే నాకు మన బాల్యస్నేహం గుర్తొస్తే, నీకు రెండువందల బాకీ గుర్తొచ్చింది. ఎదుటి వ్యక్తిని హేపీ ఫీలయ్యేలా చేసేవాళ్ళే ఎప్పుడూ గొప్పవాళ్ళు అనేవాడివి. ఓ చిన్న ఆర్థిక సంబంధం నీ మనసులోంచి మన స్నేహమాధుర్యాన్ని తుడిచేసిందంటే డబ్బు పాపిష్ఠిది అన్న పెద్దలమాట ఎంత నిజమో అర్థమౌతోంది.

తుఫానులో చిక్కుకున్న ఓడని ఒడ్డునుంచి చూసి జాలి పడడం వేరు, ఆ ఓడలోనే ఉండి తుఫానుని స్వయంగా అనుభూతించడం వేరు. అందుకే నిన్ను నేను తప్పుపట్టడం లేదు. నువ్వా రెండువందల గురించి మరిచిపోతే నేను చాలా సంతోషిస్తాను.

నిన్నూ నీ కుటుంబాన్నీ చూడాలని, మాట్లాడాలని, చిన్నప్పటి తీపి జ్ఞాపకాల్ని కలబోసుకోవాలని అనుకున్న నా అభిలాషను మొదలంటా త్రుంచేసిన రూపాయలు సంఖ్యాపరంగా తక్కువే అయినా, వాటి శక్తి నన్ను ఆశ్చర్యంలో ముంచేస్తోంది. బహుశా ఈ ఆశ్చర్యం తాలూకు విషాదం నుంచి నేను ఇప్పుడప్పుడే కోలుకోలేను.''

– భారతి